## క్లుప్తంగా

### వేడుకలను విజయవంతం చేయండి

**గోల్కొండ:** గురువారం జరిగే మజ్లిస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కోరారు. దారుస్సలాంలో జరిగే మజ్లిస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దారుస్సలాంలో ఉదయం 10 గంటలకు పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. పార్టీ అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

### ఉస్మానియాకు రోగుల తాకిడి




**అఫ్జల్‌గంజ్:** ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. బుధవారం ఒక్క రోజే దాదాపు 2000 మంది అవుట్ పేషెంట్లు చికిత్స పొందారు. సెలక్టివ్ సర్జరీ, మేజర్ సర్జరీలు దాదాపు 50, మైనర్ సర్జరీలు 30, ఎమర్జెన్సీ మేజర్ సర్జరీలు 6, మైనర్ సర్జరీలు 122 చేశామని, రోగుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ తెలిపారు.

### కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించిన బీజేపీ నేత

**గోల్కొండ:** కంటి వెలుగు కేంద్రాల సిబ్బంది మరింత క్రమశిక్షణతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని బీజేపి రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లోని కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బంది పనితీరు బాగుంటే కంటి వెలుగు కేంద్రానికి అధిక సంఖ్యలో ప్రజలు వస్తారని అన్నారు.

### నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటాం

**చార్మినార్:** మంచినీటి సరఫరాతో పాటు డ్రైనేజీ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటామని జలమండలి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హకీం అన్నారు. స్థానిక బీజేపీ నాయకులు టి.ఉమామహేంద్ర ఫిర్యాదు మేరకు ఆయన ఘాన్సీబజార్ డివిజన్‌లోని చార్‌మహల్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా సమస్యలను సాధ్యమైనంత వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు.

### రెండు హోటళ్లకు షోకాజ్ నోటీసులు



రంగులు, ఆహార పదార్థాలను సీజ్ చేస్తున్న అధికారులు

**లంగర్‌హౌస్:** ఆహార పదార్థాల్లో విషపూరిత రంగులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రత అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. లంగర్‌హౌస్‌లోని పలు హోటళ్లలో మంగళవారం తనిఖీ నిర్వహించారు. ముఖ్యంగా బాపూనగర్ బస్‌స్టాప్ వద్ద ఉన్న సురభి హోటల్, రేణుక రెస్టారెంట్లపై పలు ఫిర్యాదులు అందాయని అధికారి తెలిపారు. ఇందులో భాగంగా విషపూరిత రంగులు, కెమికల్ డబ్బాలు, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను సీజ్ చేశారు. హోటల్ లోపల కూడా పరిశుభ్రత పాటించడంలేదని సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఈ రెండు హోటళ్లకు షోకాజ్ నోటీసులు అందించామని, త్వరలో క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

### గృహిణి అదృశ్యం



**చాంద్రాయణగుట్ట:** ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గృహిణి అదృశ్యమైంది. సునీల్, జ్యోతి (28) దంపతులు పటేల్‌నగర్‌లో నివాసముంటున్నారు. జనవరి 31న ఉదయం 11 గంటలకు దేవాలయానికి వెళుతున్నానని చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవంతో మరుసటి రోజు భర్త ఫోన్ చేయగా అనంతపూర్ వెళుతున్నానని.. మూడు రోజులయ్యాక వస్తానని చెప్పింది. అప్పటి నుంచి ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఆమె ఆచూకీ కోసం అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# ప్రమాద ఘంటికలు మోగిస్తున్న విద్యుత్ వైర్లు

- నివాస, వ్యాపార సముదాయాలకు దగ్గరగా విద్యుత్ వైర్లు
- యుజీ కేబుల్ వ్యవస్థ అందుబాటులోకి తేవాలంటున్న స్థానికులు..

**చార్మినార్:** టీఎస్ఎస్‌పీడీసీఎల్ సౌత్ సర్కిల్‌లోని హైదరాబాద్ పాతబస్తీలో విద్యుత్ తీగలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. గృహాలు, వ్యాపార సముదాయాలకు అతి సమీపం నుంచి విద్యుత్ వైర్లుండటంతో అవి స్థానికులకు దడ పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా హైటెన్షన్ విద్యుత్ వైర్లతో ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పాతబస్తీలో విద్యుత్ వైర్లను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందంటున్నారు. ఈ నెల 25న సాయంత్రం జరిగిన విద్యుత్ షాక్ ఘటనతో పాతబస్తీ ప్రజలు షాక్‌కు గురయ్యారు. అభంశుభం తెలియని నిరుపేద వెల్డర్ హైటెన్షన్ విద్యుత్ షాక్‌కు గురి కావడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిర్లక్ష్యానికి బలైన నిండు ప్రాణం...**

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన బ్రిజేష్ కుమార్ పాతబస్తీ ఫలక్‌నుమాలోని ఇమ్రాన్ అనే వెల్డింగ్ యజమాని వద్ద వెల్డర్‌గా పని చేస్తున్నాడు. యజమాని సూచన మేరకు అన్సారీ రోడ్డులోని ఓ దుస్తుల దుకాణం బోర్డు వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. అక్కడే అతి సమీపంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లుండటంతో విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు.




అతి సమీపం నుంచి హెచ్‌టీ విద్యుత్ వైర్ల వద్ద పని చేస్తున్న వెల్డర్(ఫైల్)

**అండర్ గ్రౌండ్, ఏబీ కేబుల్ అందుబాటులోకి తేవాలి..**

అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్‌తో పాటు ఏబీ కేబుల్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పాతబస్తీ ప్రజలు ఎప్పటి నుంచో సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గృహాలు, వ్యాపార సముదాయాలకు దగ్గరగా ఉన్న ఎల్టీ, హెచ్‌టీ విద్యుత్ వైర్లను దూరంగా ఏర్పాటు చేయడమే కాకుండా అండర్ గ్రౌండ్ ఎయిర్ బీచ్ కేబుల్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

> **ముందుకు జరిగి నిర్మిస్తున్నందువల్లే ఈ సమస్య..**
>
> టీఎస్ఎస్‌పీడీసీఎల్ చార్మినార్ డివిజన్ పరిధిలోని పాతబస్తీలో దశాబ్దాల క్రితం ఉన్న విద్యుత్ వైర్లు నివాస,వ్యాపార సముదాయాలకు దూరంగా ఉన్నాయి. రాను రాను ముందుకు జరిగి నిర్మాణాలు చేపడతుండడంతో విద్యుత్ వైర్లకు దగ్గరవుతున్నారు. దీంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక యుజీ,ఏబీ కేబుల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడానికి ఎక్కువ మొత్తంలో బడ్జెట్ కావాల్సి ఉంటుంది. - లింగయ్య, చార్మినార్ డీఈ

## గోషామహల్ అభివృద్ధికి కృషి : మంత్రి తలసాని

**అబిడ్స్:** గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు రాష్ట్రమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌ను బాధిత మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా అన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.



## క్రీడా, సాంస్కృతిక రంగాలలో రాణించాలి



బహుమతులను అందజేస్తున్న నటుడు హర్షవర్ధన్

**గన్‌ఫౌండ్రీ:** పాఠశాల స్థాయినుంచే చిన్నారులను విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాలలో రాణించే విధంగా తీర్చిదిద్దాలని సినీ నటుడు హర్షవర్ధన్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో గీతాంజలి ప్రాథమిక ఉన్నత పాఠశాలల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆటపాటలు, దేశభక్తి గీతాల నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.... విద్యార్థులకు నాణ్యమైన విద్యతను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

## ఉత్సాహంగా మహిళా దినోత్సవం

**గన్‌ఫౌండ్రీ:** హస్త, చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా విభిన్న కళలతో కూడిన చేనేత వస్త్రాలను వినియోగదారులకు అందిస్తున్నట్లు శ్రీ అవంతి సిల్క్ వస్త్ర షోరూమ్ నిర్వాహకులు నేహా మిశ్రా, విజయ్‌శర్మలు తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని శ్రీ అవంతి సిల్క్స్‌లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4, 5 తేదీలలో మహిళల కోసం అన్ని ఉత్పత్తులపై 50 శాతం డిస్కౌంట్‌తో ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పోచంపల్లి, కలంకారి వంటి అనేక రకాల చీరలను ప్రత్యేక తగ్గింపు ధరలతో ఇవ్వనున్నట్లు తెలిపారు.



వేడుకల్లో పాల్గొన్న నేహా మిశ్రా తదితరులు

## ఇంటర్ బోర్డు ముట్టడికి యత్నం

**నాంపల్లి:** శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి సాత్విక్ ఆత్మహత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు కార్యాలయాన్ని ముట్టడించడానికి వెళ్తున్న యూత్ కాంగ్రెస్ నేతలను బేగంబజార్ పోలీసుల అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో గాంధీభవన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గాంధీభవన్ గేట్లు దాటుకుని బయటకు రాగానే పోలీసులు యూత్ కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసి అక్కడి నుంచి గోషామహల్‌కు తరలించారు.

## సురేందర్ మాదిగకు ఘన నివాళి



సురేందర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహేందర్‌కుమార్ తదితరులు

**సుల్తాన్‌బజార్:** మాదిగ జాతి అభ్యున్నతి కోసం ప్రాణత్యాగం చేసిన సురేందర్ మాదిగ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ ఉద్యమ నేత, గోషామహల్ నియోజకవర్గం సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఆర్వి మహేందర్ కుమార్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో భాగంగా గాంధీభవన్ ఘటనలో అమరుడైన పొన్నాల సురేందర్ మాదిగ 14వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం అబిడ్స్ ట్రూప్‌బజార్ చౌరస్తాలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన సురేందర్ మాదిగ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, మీసాల క్రాంతి పాల్గొన్నారు.

**అబిడ్స్:** ఎంజేమార్కెట్ వద్ద సురేందర్ విగ్రహానికి గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు ఎస్.ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

**గన్‌ఫౌండ్రీ:** రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ.. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 నుంచి ఇప్పటివరకు రెండుసార్లు కనీస వేతనాల సలహా మండలిని ఏర్పాటు చేసి కార్మిక శాఖ ద్వారా ప్రతిపాదనలు తెప్పించుకుని కూడా పెండింగ్‌లో పెట్టడం అన్యాయమన్నారు. యజమానుల ప్రయోజనాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరించడం లేదని ఆరోపించారు. అనంతరం డీఆర్‌ఓ సూర్యకళను కలిసి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, ఉపాధ్యక్షుడు అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా సైన్స్‌డే

**విజయనగర్‌కాలనీ:** సెయింట్ ఆన్స్ పాఠశాల, విజయనగర్ కాలనీలో బుధవారం సైన్స్ డేను వినూత్నంగా నిర్వహించారు. మానవ శరీరంలోని వివిధ భాగాలు, నిత్య జీవితంలో ఉపయోగించే పరికరాలు తయారు చేసిన ఉపాధ్యాయులు విద్యార్థులకు వాటి పనితీరును తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ అల్లం విజయరాణి, కరస్పాండెంట్ రోజీఫ్రాన్సినా పాల్గొన్నారు.



## ఉగాది పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

**నాంపల్లి:** రానున్న శోభకృతు నామ ఉగాది సందర్భంగా శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మార్చి 27న ఉగాది జాతీయ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సంగీతం, సాహిత్యం, నృత్యం, సినీ, టెలివిజన్, రాజకీయ, విద్య, వైద్య, న్యాయ, సామాజిక సేవ, పండిత, పురోహిత, వాస్తు, జ్యోతిష్య రంగాలలో రాణిస్తున్న వారికి పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు మార్చి 12 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9494523562 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీదే విజయం

**అబిడ్స్:** ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా బీజేపీ విజయం సాధిస్తుందని రాష్ట్ర బీజేపీ కార్యాలయ కోఆర్డినేటర్ గోపాల్‌జీ పేర్కొన్నారు. చందన్‌వాడిలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. అన్నివర్గాల ప్రజలు మోదీ పథకాలకు ఆకర్షితులై బీజేపీని ఆదరిస్తున్నారన్నారు. కార్పొరేటర్ లాల్‌సింగ్, నట్రాజ్ నామ్‌దారి, రఘు, కమల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ, కార్పొరేటర్ లాల్‌సింగ్, నట్రాజ్ నామ్‌దారి

# అధికారుల పర్యవేక్షణ లోపం.. ప్రజలకు శాపం



ఎండీ లైన్స్‌లో నత్తనడకన జరుగుతున్న పైప్‌లైన్ పనులు

**గోల్కొండ:** అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజలకు శాపంగా మారింది. కార్వాన్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటిలో ముఖ్యంగా బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు ముఖ్యమైనవి. అయితే అధికారులు ఈ పనులను కాంట్రాక్టర్ల ఇష్టానికే వదిలేశారు. పనులు అతి నెమ్మదిగా జరుగుతున్నాయి. గోల్కొండ, లంగర్‌హౌస్, టోలిచౌకి తదితర డివిజన్లలో కొంత కాలంగా ఈ పనులు జరుగుతున్నాయి. బస్తీలు, కాలనీలకు వరదముప్పు తప్పించడానికి భారీ డ్రైనేజీ పనులు జరుగుతుండగా ఈ పనుల్లో కాంట్రాక్టర్లదే హవా సాగుతోంది. భారీ పైపులు వేయడానికి జరుగుతున్న పనులు నెమ్మదిగా సాగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ పనులు జరుగుతున్న ప్రాంతాలలో రోడ్లను మూసివేసి వాహనాలను దారి మళ్లిస్తున్నారు. అయితే దీర్ఘ కాలంగా తాము నేరుగా ఇళ్లకు వెళ్లలేకపోతున్నామని చుట్టూ తిరిగి వెళ్తుండటంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల వారు అంటున్నారు. టోలిచౌకి టూంబ్స్ రోడ్డుపై జరుగుతున్న పనుల కారణంగా ట్రాఫిక్‌ను నదీమ్ కాలనీ గుండా మళ్లించారు. అయితే పలు ప్రాంతాలలో రోడ్లు మరీ ఇరుకుగా ఉండటంతో పాటు పలుచోట్ల అధ్వాన్నంగా ఉన్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఇదిలా ఉండగా ఈ పనుల కోసం చేట్టిన తవ్వకాల వద్ద మట్టి కుప్పలను అలాగే వదిలేస్తున్నారు. రోడ్డు పక్కనే భారీ మట్టి కుప్పలు అలాగే ఉంటున్నాయి. ఏదేమైనా అధికారులు ప్రజల కోసం జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే మట్టి కుప్పలు

## విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం



విశ్రాంత అధ్యాపకులను సన్మానిస్తున్న దృశ్యం

**గన్‌ఫౌండ్రీ:** నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని సరోజినీనాయుడు వనితా మహావిద్యాలయ కళాశాలలో బుధవారం సైన్స్‌డే సందర్భంగా పలు పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాతావరణ కేంద్రం అధిపతి డాక్టర్ నాగరత్న మాట్లాడుతూ... విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రాన్ని ఉదాహరణలతో వినిపించాలని సూచించారు. వివిధ అంశాలపై నిర్వహించినటువంటి ఈ పోటీలకు దాదాపు 200 మంది విద్యార్థినీలు హాజరయ్యారు. అనంతరం విశ్రాంత అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులు

**జియాగూడ:** క్వెస్ట్ ట్యాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ శ్రేష్ఠ సమ్మాన్ అవార్డు 2023లో జియాగూడ కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు పోటీల్లో ప్రతిభ చాటారని జియాగూడ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాస్, అకాడమి ప్రిన్సిపల్ పి.శ్రీకాంత్‌లు అన్నారు. ఈ మేరకు బుధవారం కేటీ ఎస్ స్కూల్ ఆవరణలో ప్రతిభ చాటిన ఏడుగురు విద్యార్థులను అభినందించారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్వెస్ట్ ట్యాలెంట్ ఒలంపియాడ్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్

## సైన్స్ ఫెయిర్‌తో కొత్త ఆవిష్కరణలు





**గోల్కొండ:** సైన్స్ ఫెయిర్లతో విద్యార్థుల్లోని ప్రతిభ బయటకు వస్తుందని, ఆలోచనాశక్తి మరింత పెరుగుతుందని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హానా మొబిన్ అన్నారు. గుడిమల్కాపూర్ నారాయణ స్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు వారు తయారు చేసిన నమూనాలు, వాటి పనితీరు గురించి వివరిస్తున్న తీరు చాలా బాగుందన్నారు. మరింత ఉత్సాహంగా విద్యార్థులు కొత్త ఆవిష్కరణల వైపు ఆకర్షితులవుతారని అన్నారు. ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, రీజనల్ ఇన్‌చార్జి నవీన్, జోనల్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఫర్హానా, రష్మీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా అకాడమీ ఫెయిర్

**చార్మినార్:** చార్మినార్ నారాయణ స్కూల్‌లో బుధవారం అకాడమీ ఫెయిర్ ఉత్సాహంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఫెయిర్‌లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇలాంటి ఫెయిర్‌లు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తాయని అస్రా అసుపత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఇర్ఫాన్ ఖాన్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను వారు తిలకించారు. డీజీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్, ప్రిన్సిపాల్ భవానీ పాల్గొన్నారు.



అకాడమిక్ ఫెయిర్‌ను తిలకిస్తున్న డాక్టర్ ఇర్ఫాన్ ఖాన్

## ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి



ప్రీతికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

**సుల్తాన్‌బజార్:** వైద్య విద్యార్థి ప్రీతి కుటుంబానికి న్యాయం చేసి దోషికి ఉరిశిక్ష విధించాలని బుధవారం సిటీ కళాశాల విద్యార్థులు నినదించారు. ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఘటనకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చెయ్యాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి, కళాశాల అధికారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

**బంజారాహిల్స్:** ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిపై బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.12 ప్రధాన రహదారిలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ టి.నరసింహరాజు, ట్రాఫిక్ ఎస్ఐ రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు కొనసాగాయి. కొన్నేళ్లుగా రోడ్ నెం.12 ఇన్‌కం ట్యాక్స్ క్వార్టర్స్ ప్రహరీ గోడను ఆనుకొని పెద్ద ఎత్తున ఫుట్‌పాత్‌పై బండ్లు ఏర్పాటు చేశారు. దీంతో పాదచారులకు ఆటంకంగా మారింది. ఆరు నెలల నుంచి ట్రాఫిక్ పోలీసులు వారికి అవగాహన కల్పించడంతో పాటు కొంత మందికి జరిమానా విధించారు. మరికొంత మందిపై ఎఫ్ఐఆర్ సైతం నమోదు చేశారు. అయినప్పటికీ ఆక్రమణదారుల్లో మార్పు రాలేదు. దీంతో డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్‌లపై ఉన్న తోపుడు బండ్లు, డబ్బాలు తొలగించారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన

**హిమాయత్‌నగర్:** ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్రాజు పేర్కొన్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో 'రోడ్డు భద్రత-ట్రాఫిక్ నిబంధనలు' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావి పౌరులుగా ఎదగాల్సిన వారు అర్థాంతరంగా రోడ్డు ప్రమాదాల్లో తనువు చాలించకూడదనే ఉద్దేశంతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తాము వివరించిన అంశాలను కుటుంబ సభ్యులకు, చుట్టుపక్కల వారికి, బంధువులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ గురించి వీడియో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణగూడ ఎస్ఐ షేక్ షఫీ, ఏఎస్ఐ సుబ్బారావు, బేగంపేట టీటీఐ కానిస్టేబుళ్లు ఎన్.వెంకటప్రసాద్, నర్సింలు పాల్గొన్నారు.

## బీసీ వ్యతిరేక విధానాలను ఉపేక్షించం

**లిబర్టీ:** కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక విధానాలను ఇక ఉపేక్షించేది లేదని, 2024 ఎన్నికలే లక్ష్యంగా బీసీలు తిరుగుబాటు చేసి బీజేపీని ఓడిస్తారన్నారు. బుధవారం బీసీ దళ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీల అభివృద్ధి కోసం పథకాలు అమలు చేసేందుకు జనాభా వివరాలు అవసరమన్నారు. రాష్ట్రంలోని బీసీల వివరాలు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు లేఖ రాశారని ఆయన గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా కలిసి ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమన్నారు.